12న రాష్ట్రానికి ప్రధాని మోడీ

- సిఎస్ సోమేశ్ కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ ఈ నెల 12న రాష్ట్రానికి రానున్నారని, రామగుండంలో పర్యటించనున్నారని ఈ సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లను చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో శుక్రవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. డిజిపి మహేందర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్ కుమార్, రామగుండం ఫర్టిలైజర్ ఫ్యాక్టరీ సిఇఒ ఎకె జైన్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ప్రధాని పర్యటన ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వేదికల వద్ద తగిన బందోబస్తు, శాంతి భద్రతలు, తదితర ఏర్పాట్లను బ్లూబుక్ ప్రకారం చేయాలన్నారు.

స్కూల్ వ్యాన్ ఢీకొని బాలుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ ప్రయివేటు స్కూల్ వ్యాన్ ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలకు చెందిన స్కూల్ వ్యాన్ సాయంత్రం విద్యార్థులను స్కూల్ నుంచి ఎక్కించుకొని వారి ఇంటి వద్ద దించుతుంది. ఈ క్రమంలో పాశం వెంకట్రామిరెడ్డి, రుచిత దంపతుల చిన్న కుమారుడు పాశం షణ్ముఖ రెడ్డి(5) అనే విద్యార్థి వ్యాన్ దిగి వెళ్తున్న క్రమంలో వ్యాన్ వెనుక టైరు విద్యార్థిపై ఎక్కటంతో ఆ బాలుడు అక్కడికక్కడే మరణించాడు. వ్యాన్ డ్రైవర్ చూడకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. జరిగిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టిటిడిపి అధ్యక్షులుగా కాసాని జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ తెలుగుదేశం పార్టీ (టిటిడిపి) రాష్ట్ర అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్‌ను ఆపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు నియమించారు. మూడు వారాల క్రితం ఆయన చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షులుగా పని చేస్తున్న బక్కని నర్సింహులును పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా నియమించారు.

మధ్యాహ్న భోజన పథకానికి..

అధిక నిధులు కేటాయించాలి

- జాతీయ రెండో మహాసభలో నర్సిరెడ్డి
- కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలి : చుక్క రాములు



సభలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మధ్యాహ్న భోజన పథకానికి అధిక నిధులు కేటాయించాలని అఖిల భారత మిడ్డేమీల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ మహాసభల ఆహ్వానసంఘం చైర్మెన్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండురోజులపాటు కొనసాగనున్న అఖిల భారత మిడ్డేమీల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ రెండో మహాసభ శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జె భగవాన్ అధ్యక్షతన ప్రారంభసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 11.70 లక్షల పాఠశాలల్లో 12 లక్షల మంది పిల్లలకు ఈ పథకం అందుతున్నదని వివరించారు. ఆ పథకం ద్వారా భోజనం వృధా కావడం లేదనీ, అవినీతికి చోటు లేదనీ, 200 శాతం విజయవంతంగా అమలవుతుందని చెప్పారు. దేశంలో 39 శాతం మంది పిల్లలు పౌష్టికాహారం లేక బాధపడుతున్నారని వివరించారు. మత సామరస్యానికి, గంగా జమునా తెహజీబ్‌కు ప్రతీక హైదరాబాద్ అని అన్నారు. అయితే బిజెపి మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చు పెట్టాలనీ, శాంతి సామరస్యానికి విఘాతం కల్పిస్తోందని విమర్శించారు. వాటికి చోటివ్వకూడదని ఆయన పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనాలను ఇవ్వాలని చెప్పారు. కేంద్రీకృత కిచెన్ షెడ్లలో వండడం వల్ల హైదరాబాద్‌లో 20 నుంచి 30 శాతం మంది పిల్లలే భోజనం తింటున్నారని వివరించారు. కానీ కార్మికులు ఆ పాఠశాలలోనే వంట చేయడం వల్ల 95 నుంచి వంద శాతం పిల్లలు భోజనం చేస్తున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కార్పొరేట్ సంస్థలకు, ఎన్‌జిఒలకు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు.

కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆహ్వాన సంఘం వైస్ చైర్మెన్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన పథకం పేద పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతోందని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పథకాలకు సరిపోయినన్ని నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. ఎక్కువ నిధులు కేటాయిస్తేనే ప్రజలకు ప్రయోజనకరమని అన్నారు. పథకాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎక్కువ పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అఖిల భారత మిడ్డేమీల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి మాట్లాడుతూ పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల్లో కోత విధిస్తున్నదని విమర్శించారు. పెట్రోల్, గ్యాస్ వంటి ధరల పెరుగుదలతో కార్మికులు, ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మిడ్డేమీల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ రమ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం కార్మికులకు రూ.వెయ్యి పారితోషికం ఇస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం దాన్ని రూ.రెండువేలకు పెంచుతామంటూ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

ఈ పథకానికి నగదు బదిలీని తేవడాన్ని తీవ్రంగా ఖండించారు. పారితోషికం రూ.రెండు వేలు పెంచాలనీ, ఇతర సమస్యలను పరిష్కరించాలంటూ దశలవారీ పోరాటాలు చేస్తామనీ, అవసరమైతే ఫిబ్రవరిలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి, అంగన్‌వాడీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ఉషా, ఆశా వర్కర్ల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు సురేఖ, మిడ్డేమీల్ ఫెడరేషన్ జాతీయ నాయకులు స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నపై వేటు తప్పదా?

- షోకాజ్ నోటీసు అందలేదని బుకాయింపు
- రెండోసారి షోకాజ్ నోటీసులు
- అది ఫేక్ ఆడియో...ఆ వాయిస్ నాది కాదు : ఎంపి కోమటిరెడ్డి



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై వేటు తప్పదా? ఆయన్ను సస్పెండ్ చేసేందుకు ఎఐసిసి అధిష్టానం సిద్ధమవుతుందా? అనే చర్చ జోరుగా సాగుతుంది. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న తాజా పరిణామాలు ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు. 'మునుగోడు ఎన్నికల ప్రచారానికి పోకపోవడం, తమ్ముడు బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఓటువేయాలని చెప్పడం, రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, మునుగోడులో కాంగ్రెస్ గెలవదు. అందుకే నేను ప్రచారానికి వెళ్లడం లేదు' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలంరేపాయి. ఈ నేపథ్యంలో ఎఐసిసి ఆయనకు షోకాస్ నోటీసు జారీ చేసింది. పదిరోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. అయితే తనకు నోటీసు అందలేదంటూ ఆయన బుకాయించినట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. మరోసారి ఆయనకు షోకాసు నోటీసు పంపినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో షోకాజ్ నోటీసుకు సమాధానం ఇచ్చినట్టు లీకులిచ్చారు. ఉప ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్న సమయంలో ఆయన ఆస్ట్రేలియా పర్యటనకు పోవడంతో ఆయనపై అనుమానాలు పెరిగాయి. ఆస్ట్రేలియా నుంచి నగరానికి చేరుకున్న ఆయన...పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ జోడో యాత్రలోనూ పాల్గొనడం లేదు. మరో మూడు రోజులు మాత్రమే తెలంగాణలో యాత్ర కొనసాగుతోంది. అయినప్పటికీ ఆయన చడిచప్పుడు లేకుండా ఉన్నారు. దీంతో ఆయనపై పార్టీ సీరియస్‌గా ఉన్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. ఎఐసిసికి సంతృప్తికరమైన సమాధానం చెప్పకపోతే ఆయన్ను సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇదే అంశంపై సోషల్‌మీడియాలో కథనాలు వస్తున్నాయి.

అది ఫేక్ ఆడియో...ఆ వాయిస్ నాది కాదు...

ఎఐసిసి ఇచ్చిన షోకాజ్ నోటీసుకు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. ఈ నెల 1న సీల్డ్ కవర్‌లో ఎఐసిసి క్రమశిక్షణ కమిటీకి సమాధానం ఇచ్చినట్లు సమాచారం. 'అది ఫేక్ ఆడియో. ఆ వాయిస్ నాది కాదు.. మార్ఫింగ్ చేసింది. పార్టీలో నేను చాలా సీనియర్ నేతను. ఎన్ఎస్‌యూఐ విద్యార్థి విభాగం నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నాను. గడిచిన 35 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పని చేస్తున్నాను. నా సీనియార్టీకి పార్టీలో సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదు' అంటూ ఆయన వివరణ ఇచ్చినట్టు తెలిసింది. పార్టీ నియమ నిబంధనలు ఉల్లంఘించి బిజెపికి ఓటు వేయాలని మునుగోడు కాంగ్రెస్ నాయకులకు ఫోన్ చేసి చెప్పడంపై ఎఐసిసి క్రమశిక్షణ కమిటీ గత నెల 22న వెంకట్‌రెడ్డికి షోకాజ్ నోటీసు ఇచ్చింది. పది రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. దీనిపై ఈ నెల ఒకటిన సీల్డ్ కవర్‌లో ఎఐసిసి క్రమశిక్షణ కమిటీకి సమాధానం ఇచ్చినట్లు సమాచారం.

ధాన్యం కొనుగోలు చేయాలి

- రైతుల ధర్నా


రోడ్డు బైఠాయించిన రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామంలో శుక్రవారం రైతులు ఆందోళన చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని స్థానిక గాంధీ చౌక్ వద్ద ముస్తాబాద్ - సిరిసిల్ల ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. వీరికి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వరి వెంకటేష్, కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సారగొండ రాంరెడ్డి మద్దతు తెలిపారు. పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, పాక్స్ సిఇఒ ఈసరి కృష్ణ, పాక్స్ డైరెక్టర్ సతీష్ చందర్‌రావు అక్కడకు చేరుకుని ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు నక్కల భాస్కర్ రెడ్డి, సొల్ల క్రాంతి కుమార్, నక్కల నారాయణ రెడ్డి, చిన్ని అంజిరెడ్డి, బద్దిపడిగే సత్యం రెడ్డి, పొన్నాల సత్యం రెడ్డి, గంగాడి బుచ్చిరెడ్డి, నక్కల రాములు, వెంకటేష్, బాలయ్య, శ్రీను, సత్యపాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

నగరంలోని బంజరాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లో మస్కతి డైరీ సమీపంలోని ఓ భవనంలో విదేశీయులు అద్దెకు ఉంటున్నారు. వారి నివాసంలో ఒక్కసారికి మంటలు చెలరేగాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. స్వల్ప ఆస్తినష్టం జరిగింది.. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదని ఫైర్ సిబ్బంది తెలిపారు.

అకాలవర్షానికి.. నేలకొరిగిన వరిపంట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్లముందే అకాల వర్షానికి నేలకొరగడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని ఎర్రవరం, గణపవరం, రామలక్ష్మీపురం గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన అకాలవర్షానికి పంటంతా నేలమటమైంది. చేతికొచ్చిన పంట నేలకొరగడంతో పెట్టుబడికి చేసిన అప్పులు ఎలా తీర్చాలని రైతులు కన్నీరు మున్నీరయ్యారు. ఇక కౌలురైతుల పరిస్థితి వర్ణణాతీతంగా ఉంది. ఎర్రవరం గ్రామానికి చెందిన చడపంగు తిరుపయ్య ఆరెకరాలు, చడపంగు కొండయ్య ఐదెకరాలు కౌలుకు తీసుకొని వరిసాగు చేశారు. ఇంతలో వర్షానికి పంట మొత్తం నీలమట్టమైంది. స్పందించిన అధికారులు ఎఇఒ సల్మా పంటపొలాలను పరిశీలించారు. విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులు, కౌలు రైతులకు నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

బిజెపి పన్నిన కుట్ర విఫలం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


మాట్లాడుతున్న తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడులో బిజెపి పన్నిన కుట్ర విఫలం కాబోతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. హన్మకొండ జిల్లా పెద్దమ్మగడ్డ ఐకె గార్డెన్‌లో శుక్రవారం సిపిఎం కార్యకర్తల శిక్షణా తరగతులను తమ్మినేని ప్రారంభించారు. పెద్దమ్మగడ్డలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేశారు. అనంతరం డప్పు వాయిద్యాలతో పెద్దమ్మగడ్డ నుంచి ఐకె గార్డెన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. తొలుత ఆ పార్టీ సీనియర్ నాయకులు సారంపల్లి వాసుదేవారెడ్డి జెండావిష్కరణ చేశారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. మునుగోడులో వామపక్షాలు బలపరిచిన టిఆర్ఎస్ అభ్యర్థి 15 వేల మెజార్టీతో గెలుస్తారని సర్వేలు చెబుతున్నాయన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేయాలనేది ఆయన సొంత నిర్ణయం కాదని, ఆయన్ని బిజెపి అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించి టిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బిజెపినే అనే వాతావరణం సృష్టించాలని కుట్రపన్నారని తెలిపారు. కానీ వారి వ్యూహం బొక్కబోర్ల పడుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చి అక్రమంగా బిజెపి అధికారంలోకి రావాలని అనేక కుట్రలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే మునుగోడు ఉప ఎన్నికలు వచ్చాయని తెలిపారు. ఆర్థిక స్థితి బలంగా ఉన్న వాళ్ళను వాడుకుంటూ అధికారంలోకి రావాలని చూస్తోందన్నారు. దేశంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను బిజెపి కూల్చివేసిందన్నారు. ప్రజాస్వామ్యం బతకాలంటే బిజెపిని అన్ని రంగాల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం సిఎం కెసిఆర్‌కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. శిక్షణా తరగతుల్లో సిపిఎం హన్మకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి, జిల్లా కమిటీ సభ్యులు వాంకుడోతూ వీరన్న, గొడుగు వెంకట్, మంద సంపత్, భాను నాయక్, కె. లింగయ్య, దీప, నార్త్ కమిటీ కార్యదర్శి గాదె రమేష్ పాల్గొన్నారు.

7న రాహుల్ బహిరంగసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్రలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆది, సోమవారాల్లో (6వ, 7వ తేదీ) కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్, మద్నూర్‌లో కొనసాగనున్న జోడో యాత్ర రూట్ మ్యాప్‌ను, మద్నూర్ మండలం మేనూర్‌లో జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు నుంచి మహారాష్ట్రకు వెళ్లే యాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ జోడో యాత్ర విజయవంతం చేయాలని జుక్కల్ నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారామ్‌కు సూచించారు. పెద్ద ఎత్తున జన సమీకరణ చేపట్టాలని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తా, నాయకులు హాజరుకావాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణికం ఠాకూర్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మాజీ ఎంపి సురేష్ షెట్కర్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారం, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్, కైలాస్ శ్రీనివాస్, ఇతర రాష్ట్ర ముఖ్య నాయకులు స్థానిక నియోజకవర్గ నాయకులు మండల నాయకులు తదితరులున్నారు.

పవన్‌కల్యాణ్ ఇంటి వద్ద దాడికి కుట్ర జరగలేదు

- పోలీసులు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్‌లోని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇంటి వద్ద రెక్కీ కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు దాడికి కుట్ర ఏమీ జరగలేదని తెలిపారు. నిందితులు ఆదిత్య విజయ్, వినోద్, సాయికృష్ణగా గుర్తించారు. ముగ్గురు యువకులు పబ్‌లో మద్యం తాగి వస్తూ పవన్ ఇంటి వద్ద కారు ఆపగా.. పక్కకు తీయాలని అడిగిన పవన్ సెక్యూరిటీతో వారు గొడవపడ్డారని పోలీసులు తెలిపారు. తాగిన మైకంలోనే గొడవపడినట్టు యువకులు అంగీకరించారన్నారు. పవన్ ఇంటి వద్ద ఆపిన గుజరాత్ రిజిస్ట్రేషన్ కారు సాయికృష్ణదేనని పోలీసులు వెల్లడించారు.


జూబ్లీహిల్స్‌లో జనసేన కార్యకర్తల ఆందోళన..

మరోవైపు జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-36లోని తబ్లా రస పబ్‌ను మూసివేయాలని డిమాండ్ చేస్తూ జనసేన కార్యకర్తలు శుక్రవారం ఆందోళనకు దిగారు. పవన్ కల్యాణ్ ఇంటికి సమీపంలో ఉన్న పబ్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.

నివాస ప్రాంతాల మధ్య పబ్‌లు ఉండొద్దని, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. పబ్ వద్దకు జనసేన కార్యకర్తలు భారీగా తరలి వస్తుండటంతో సమీపంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పోలీసులు అడ్డుకున్నారు.

ఒడిసిన ఎర్రజొన్న ఒప్పందాలు

- అగ్రిమెంట్‌కు ఢిల్లీవ్యాపారుల విముఖత
- ఒప్పందాలకు కట్టుబడని విత్తనడీలర్లు
- వ్యాపారులు మొఖం చాటేయడంతో స్థానికులు చెప్పిందే ధర
- అంతిమంగా నష్టపోతున్న రైతన్న


ఎర్రజొన్న కంకులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎర్రజొన్న కొనుగోళ్లలో కీలకమైన 'కొనుగోలు ఒప్పందాలు' నీరుగారుతున్నాయి. ఫలితంగా ఈ పంట కొనుగోళ్లకు ఆసక్తి చూపిన ఢిల్లీవ్యాపారులు మొఖం చాటేస్తున్నారు. గతంలో ఢిల్లీ వ్యాపారులు నేరుగా జిల్లాకు రావడంతో పంట కొనుగోలుకు మార్కెట్‌లో పోటీ ఉండేది. ఫలితంగా రైతులకు ధర ఎక్కువగా వచ్చేది. ఒప్పందాలు సైతం అధిక ధరకు జరిగేవి. దీంతో రైతులు కొంత లాభపడేవారు. కానీ కొంతకాలంగా స్థానిక విత్తన డీలర్లు రైతులతో ఒప్పందాలను నీరుగార్చి వ్యాపారులు జిల్లాకు రాకుండా చేశారు. మూడేళ్లుగా కొనుగోళ్లకు సంబంధించి ఆశించిన మేర ఒప్పందాలు జరగడం లేదు. పంట చేతికొచ్చిన సమయంలోనే కొనుగోళ్లు చేస్తామంటూ మళ్లీ పరిస్థితి మొదటికి తీసుకొచ్చారు. ఢిల్లీవ్యాపారులు ఆసక్తిగా లేకపోవడంతో స్థానిక విత్తన డీలర్లు వ్యాపారుల అవతారమెత్తి సిండికేట్‌గా మారి తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తూ రైతులకు కుచ్చుటోపి పెడుతున్నారు.

నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, భీంగల్ మండలాల్లో ఎక్కువగా ఎర్ర జొన్న పంట సాగు చేస్తారు. సాధారణంగా జిల్లాలో 35 వేల ఎకరాల నుంచి 40 వేల ఎకరాల్లో పంట సాగు చేస్తారు. ఈ రబీ సీజన్‌లో జిల్లాలో 40,038 ఎకరాల్లో పంట సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే పంటకు ముందే కొనుగోళ్లపై ఒప్పందాలు చేసుకోవాలని రైతులకు వ్యవసాయ శాఖ సూచిస్తోంది. 2018లో ఎర్రజొన్నలను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసుకుంది. ఆ తర్వాత యేడాది నుంచి ఒప్పందాలు ఉంటేనే పంట సాగు చేయాలని నిబంధన తీసుకొచ్చింది. నాటి నుంచి ఈ పంట సాగుపై కానీ కొనుగోలుపై కానీ సర్కారు దృష్టి సారించడం లేదు. వ్యాపారులు-రైతుల మధ్య అంగీకారం ఉంటేనే పంట సాగు చేయాలని స్పష్టం చేసింది. అయితే సర్కారు పక్కకు తప్పుకోవడంతో 2018, 2019, 2020 వరకు ఢిల్లీ నుంచి వ్యాపారులు వచ్చి రైతులతో ఒప్పందాలు చేసుకున్నారు. ఆ వ్యాపారులకు స్థానిక విత్తన డీలర్లు సహకారం అందించారు. కానీ ఈ ఒప్పందాలు పక్కాగా అమలు జరగలేదు. ఒకవేళ ఒప్పందం ఉల్లంఘిస్తే ఏం చర్యలు చేపడతారన్న అంశంపై స్పష్టత కరువయ్యింది.

ఒప్పందాన్ని ఇరు పక్షాల్లో ఏ ఒక్కరూ నిరాకరించినా వారిపై ఫిర్యాదు చేయడం, విచారణ చేయడానికి సంబంధించి వ్యవసాయ శాఖలో ప్రత్యేక యంత్రాంగం అంటూ ఏమీ లేదు. దాంతో ఈ ఒప్పందాలకు చట్టబద్ధత అన్నది లేకుండా పోయింది. ఒప్పందాలు చేసుకున్న తర్వాత ఒకవేళ పంట చేతికొచ్చే సమయంలో మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉంటే.. విత్తన డీలర్లు రైతులను ఉసిగొల్పి ఇతరులకు అమ్మే విధంగా ప్రోత్సహించారు. ఒకవేళ మార్కెట్‌లో ధర పడిపోతే మాత్రం 'ఒప్పందం ప్రకారం చెప్పిన ధరకు కొనుగోలు' చేయాల్సిందే అంటూ వ్యాపారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. దాంతో రెండు విధాలుగా వ్యాపారులను నష్టం చేయడంతో ఢిల్లీ వ్యాపారులు జిల్లాకు రావడం ఆపేశారు. ఒప్పందాలకు విముఖత చూపుతున్నారు.

విత్తన డీలర్లే వ్యాపారులుగా..

ఢిల్లీ వ్యాపారులు ఒప్పందాలకు విముఖత చూపడంతో స్థానిక విత్తన డీలర్లు వ్యాపారుల అవతారమెత్తారు. మార్కెట్‌లో గతంలో కొనుగోలుకు పోటీ ఉండటంతో క్వింటా ధర ఎక్కువగా పలికేది. ఒకానొక సమయంలో క్వింటాకు రూ.మూడు వేలకు పైగా ధర పలికింది. కానీ ఢిల్లీ వ్యాపారులు ఒప్పందాలు నిలిపేయడంతో మార్కెట్‌లో కొనుగోళ్లలో పోటీ తగ్గింది. దీన్ని ఆసరాగా చేసుకుని విత్తన డీలర్లు సిండికేట్‌గా మారి అతి తక్కువకు కొనుగోలు చేస్తున్నారు.

ఎస్ టి ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ పథకం దరఖాస్తుల స్వీకరణ తేది పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ షెడ్యూల్ తెగల ఆర్థిక సహకార సంస్థ లిమిటెడ్ (ట్రైకార్), గిరిజన సంక్షేమ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సిఎం ఎస్‌టి ఎంటర్ ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ పథకం'లో భాగంగా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని గిరిజనసంక్షేమ శాఖ కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామర్థ్యాల పెంపుదల కోసం శిక్షణ, పరిశ్రమలు, వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా ఈ పథకం ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చివరి తేదీ ఈనెల ఐదులోపు చేసుకోవాలని కోరారు.

యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి

- వినోద్‌కుమార్‌కు పిహెచ్‌డి స్కాలర్స్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివిధ యూనివర్సిటీల్లో ఉన్న 1,062 అధ్యాపక పోస్టుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని పిహెచ్‌డి స్కాలర్స్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో బుధవారం పణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో గత కొన్నేళ్లుగా వివిధ కారణాల వల్ల రిక్రూట్మెంట్ జరగకుండా పెండింగ్‌లో ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ వంటి పలు పోస్టుల భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా బోయినపల్లి మాట్లాడుతూ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న యూనివర్సిటీల కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆదేశాలు రాగానే నియామక ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌డి విద్యార్థులు జి వినయ్, ఎం సంతోష్ కుమార్, ఎస్. సత్యమూర్తి, జె ప్రశాంత్, ఎల్ కామ్రేడ్, సురేష్ తదితరులు ఉన్నారు.

నగరంలో కొత్త ఆఫీసు తెరిచిన కార్గో పార్ట్‌నర్

ప్రజాశక్తి-హైదరాబాద్

ఆస్ట్రియా కేంద్రంగా పని చేస్తున్న కార్గో-పార్ట్‌నర్ హైదరాబాద్‌లో తన నూతన కార్యాలయాన్ని తెరిచినట్లు ప్రకటించింది. ఈ సంస్థ వాయు, సముద్ర, రోడ్డు రవాణలతో పాటు గిడ్డంగుల సర్వీసులను అందిస్తుంది. ఇది భారత్‌లో తమకు 16వ ఆఫీసు అని ఆ కంపెనీ సౌత్ రీజినల్ మేనేజర్ సిఆర్ మల్లికార్జున తెలిపారు. ఇక్కడ రవాణ రంగంలో విస్తృ తావకాశాలు ఉన్నాయన్నారు.

పలు కేసుల్లో హైకోర్టు విచారణ

- ఎమ్మెల్యేల ఎర కేసు ఏడుకి వాయిదా
- దర్యాప్తు వాయిదా ఉత్తర్వుల పొడిగింపు
- నిందితుల నేరాలకు ఆధారాలు ఉన్నాయన్న ప్రభుత్వం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను డబ్బుతో కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన కేసును సిబిఐకి అప్పగించాలని నిందితులు దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ సోమవారానికి వాయిదా పడింది. అప్పటి వరకు దర్యాప్తును వాయిదా వేయాలని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్టు జస్టిస్ బి విజయ్‌సేన్‌రెడ్డి ప్రకటించారు. దర్యాప్తును వాయిదా ఉత్తర్వులను రద్దు చేయాలని ప్రభుత్వం చేసిన వినతిని తోసిపుచ్చారు. నిందితులను కస్టడీలోకి తీసుకునేందుకు ఆ ఉత్తర్వులు అవరోధంగా ఉన్నాయని ప్రభుత్వం చెప్పగా, ఈ నెల 7న విచారణలో ఆ విషయాలను తేల్చుతామని హైకోర్టు ప్రకటించింది. ఎమ్మెల్యేల ఎర కేసు దర్యాప్తు సిబిఐ లేదా సిట్‌లకు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. ఇదే సమయంలో ఎర కేసు నిందితులు రామచంద్రభారతి, నంద కుమార్, సింహయాజిలూ సిబిఐ దర్యాప్తు కోరుతూ శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. ఇదే తరహాలో నందు సతీమణి చిత్రలేఖ సైతం పిటిషన్ దాఖలు చేశారు. తీన్మార్ మల్లన్న ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. వీటన్నింటినీ 7న విచారిస్తామని హైకోర్టు ప్రకటించింది. ఇదిలా ఉండగా, ఈ కేసుల్ని వ్యతిరేకరిస్తూ ప్రభుత్వం 200 పేజీలకుపైగా పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసింది. ఎమ్మెల్యేలను కొనుగోలుకు ప్రయత్నాలకు ఆధారాలు ఉన్నాయనీ, బిజెపిలో చేరాలనీ నిందితులు కోరారనీ, ఈ వ్యాజ్యాలను కొట్టేయాలని ప్రభుత్వం కోరింది. సమగ్ర కౌంటర్ పిటిషన్‌ను లోతుగా పరిశీలన చేసి తమ వాదనలు చెప్పేందుకు గడువు కావాలని ప్రేమేందర్‌రెడ్డి న్యాయవాది కోరారు. మెయినాబాద్ పిఎస్‌లో నమోదైన కేసు దర్యాప్తును నిలిపివేయాలని గతంలో హైకోర్టు సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

రాజాసింగ్ కేసు విచారణ 8కి వాయిదా

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని అడ్వొకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. రాజాసింగ్‌పై పీడీ కేసు కొట్టేయాలని కేసు విచారణ హైకోర్టు ఈ నెల 8వ తేదీకి వాయిదా వేసింది. రాజాసింగ్ భార్య టి ఉషాభాయ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను బుధవారం జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డి, జస్టిస్ జె శ్రీదేవి ధర్మాసనం శుక్రవారం విచారణను కొనసాగించింది. ఎజి వాదిస్తూ, అన్ని కేసుల్లో 41ఏ కింద నోటీసులు జారీ అవసరం లేదన్నారు.

భద్రాచలానికి ఎన్నికలు నిర్వహిస్తాం

భద్రాచలంతో పాటు మరో నాలుగు గ్రామాలను పంచాయతీలుగా కొనసాగిస్తామనీ. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాల సమయంలో తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ సివి భాస్కర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం, భద్రాచలంతో పాటు మరో నాలుగు పంచాయతీ ఎన్నికలపై తగిన నిర్ణయం తీసుకోని పక్షంలో తదుపరి విచారణలో తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పింది. అంతే కాకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని విచారణకు పిలిపించుకుని వివరణ కోరతామని తెలిపింది. ఏజెన్సీ ఏరియాల్లో పంచాయతీలను మున్సిపాల్టీలుగా మార్చడానికి వీల్లేదంటూ ఎస్ వీరయ్య ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. భద్రాచలాన్ని మున్సిపాల్టీగా మారుస్తూ వెలువడిన జిఒను సవాల్ చేస్తూ వై రాజు రిట్ దాఖలు చేశారు. వీటిని శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. ఎన్నికలు నిర్వహించకుండా వాయిదా వేయడం సరి కాదని అభిప్రాయపడింది. విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది.

'మెట్రో'కు నోటీసులు

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద మెట్రో వాణిజ్య నిర్మాణాన్ని ఆపాలని దాఖలైన కేసులో హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు హైకోర్టు నోటీసులిచ్చింది. ఈ నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతాయంటూ దాఖలైన ప్రజాహిత వ్యాఖ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ సివి భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారించింది. పిటిషనర్ ఎం ఇంద్రసేనా చౌదరి వ్యక్తిగతంగా విచారణకు హాజరై ఏ విధమైన ట్రాఫిక్ సమస్యలు, వస్తాయో వివరించారు. జిహెచ్‌ఎంసి కమిషనర్, చీఫ్ సిటీ ప్లానర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(ట్రాఫిక్), హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించి విచారణ వాయిదా వేసింది.

జిల్లా క్రికెట్ అసోసియేషన్ల ఉత్తర్వులు నిలిపివేత

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్రికెట్ అసోసియేషన్లు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వుల అమలు నిలిపివేస్తూ హైకోర్టు స్టే విధించింది.

ఈ నెల 15న అధికారులతో సమావేశమైన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ క్రికెట్ అసోసియేషన్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లో ప్రకాళన, బోగస్ కమిటీల రద్దు చేయాలనీ, జిల్లాలో అసోసియేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇది బిసిసిఐ నిబంధనలకు, జస్టిస్ ఆర్‌ఎం లోధా కమిటీ సూచనలకు విరుద్ధమని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ హైకోర్టులో రిట్ దాఖలు చేసింది. క్రికెట్ అసోసియేషన్ల ఏర్పాటు రాష్ట్ర మంత్రి, ఎసిబి డైరెక్టర్ జనరల్ పరిధిలోకి రాదని వాదించింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను కొట్టేయాలని కోరింది. తదుపరి విచారణ ఈనెల 16న జరుపుతామనీ హైకోర్టు స్పష్టం చేసింది.

ఎమ్మెల్సీ మధుసూదనాచారికి హైకోర్టు నోటీసులు

గవర్నర్ కోటాలో అసెంబ్లీ మాజీ స్పీకర్ ఎస్ మధుసూదనాచారిని నియమించడాన్ని సవాల్ చేసిన కేసులో ఆయనకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాజ్యాంగ విరుద్ధంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలను నియమిస్తున్నారంటూ టి ధన్‌గోపాల్ పిల్ దాఖలు చేశారు. గతంలో గోరేటి వెంకన్న, బస్వరాజ్ సారయ్య, దయానంద్‌లను ఎమ్మెల్సీలుగా గవర్నర్ కోటాలో నియమించడాన్ని ఆయన 2020లో సవాల్ చేశారు. ఈ కేసులో మధుసూదనాచారిని కూడా ప్రతివాదిగా చేర్చాలని పిటిషనర్ న్యాయవాది వేణుమాధవ్ కోరారు. ఇందుకు అనుమతిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ సివి భాస్కర్‌రెడ్డిల ధర్మాసనం మధుసూదనాచారికి నోటీసులు జారీ చేసింది. విచారణను డిసెంబర్ 7కి వాయిదా వేసింది.

కూ యాప్ 5 కోట్ల డౌన్లోడ్

ప్రజాశక్తి-హైదరాబాద్

మైక్రో బ్లాగింగ్ వేదికకూ యాప్ ఐదు కోట్ల డౌన్లోడ్ మార్క్‌ను చేరుకున్నట్లు ప్రకటించింది. "ఈ స్థాయి మార్క్‌ను దాటుతున్నందుకు చాలా సంతోషిస్తున్నాము. ఇది తమ వివిధ భాషా సోషల్ నెట్‌వర్క్ డిమాండ్‌ను ధృవీకరిస్తుంది. శతకోటి భారతీయులు ఎదుర్కొంటున్న సమస్యను మేము పరిష్కరిస్తున్నామని చెప్పడానికి మా వేగవంతమైన వృద్ధి, అడాప్షన్ నిదర్శనం. ఆంగ్లంతో సహా పది భాషలలో అందుబాటులో ఉంది. కూ యాప్‌లో 7500 కంటే ఎక్కువ మంది ప్రముఖులు ఉన్నారు." కూ ఫౌండర్ అప్రమేయ రాధాకృష్ణ పేర్కొన్నారు.

పంటలన్నీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఎఐకెఎంఎస్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధరలు నిర్ణయించాలనీ, పంటలన్నీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆల్ ఇండియా కిసాన్-మజ్దూర్ సభ (ఎఐకెఎంఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాయల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ప్రధాన పంటలు పత్తి, వరి వస్తుండగా, మొక్కజొన్నలు వచ్చాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల కొనుగోలుకు చర్యలు చేపట్టటంలో వెనుకబడ్డాయనీ, మార్కెట్లు ఓపెనింగ్ కూడా పూర్తి స్థాయిలో జరగలేదని తెలిపారు. క్వింటాల్ వరి ఉత్పత్తి ఖర్చు సాధారణ రకాలకు రూ.4,512, ఫైన్ రకాలకు రూ.4,605 అవుతుంటే కేంద్రం అంత కంటే తక్కువగా రూ,2,040, రూ.2060గా నిర్ణయించి రైతును నష్టాల పాల్జేస్తున్నదని విమర్శించారు. వెంటనే పంటల కొనుగోలుకు చర్యలు చేపట్టాలనీ, రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇచ్చి రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

రెసిడెన్సియల్ విద్యాసంస్థలు దేశంలోనే రోల్ మోడల్

- మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మన రాష్ట్రంలో 950 కంటే ఎక్కువ రెసిడెన్సియల్ విద్యాసంస్థలతో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆయా సంస్థల్లోని విద్యార్థులకు ఉపయోగపడేందుకు మాస్ మ్యూచువల్ సంస్థ ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. అంతర్జాతీయంగా ఫైనాన్స్ రంగంలో పేరుగాంచిన ఆ కంపెనీ మంత్రితో పాటు దళిత అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జ సమక్షంలో గురువారం హైదరాబాద్‌లో పరస్పర అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేకంగా 45 రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అట్టడుగునున్న బాలికలను ప్రోత్సహిస్తూ.. ఉన్నత స్థాయికి చేరుకోవడానికి సహాయపడే దృష్టితో ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. తెలంగాణ సాంఘీక, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీల కార్యదర్శి రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ, అవసరమైన నైపుణ్యాలను అందించాలనే లక్ష్యంతో మహిళా డిగ్రీ కళాశాలల్లోని ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం డేటా సైన్స్ క్యాంపులు, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోజర్ సందర్శనలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

సర్దుబాటు సమస్యలను పరిష్కరించాలి

- సిఎస్‌కు విఆర్ఒల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విఆర్‌వొలను రీ-డిప్లాయిమెంట్ పేరుతో వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన సందర్భంగా తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, రాష్ట్ర విఆర్‌వొల కన్వీనర్ వింజమూరి ఈశ్వర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్దుబాటు సమయంలో తమ సీనియార్టీని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా స్థానిక సంస్థలు, సొసైటీల్లో రీ డిప్లాయిమెంట్ చేశారని ఫిర్యాదు చేశారు. కొన్ని శాఖల్లో విఆర్ఒలకు సమాన స్థాయి కానీ పోస్టుల్లో నియమిస్తే, మరి కొన్ని శాఖల్లో పోస్టుపై స్పష్టత ఇవ్వడం లేదని తెలిపారు. మరి కొన్ని శాఖల్లో ఐడీ నెంబర్లను మార్చారనీ, అర్హత ఆధారంగా కాకుండా లాటరీ పద్ధతిలో పోస్టింగ్ ఇచ్చి ఉరిశిక్షతో సమానమైన శిక్ష వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్లలో మూడో తేదీ నుంచి జాయిన్ అయినట్టు నమోదు చేస్తామని హామీ ఇచ్చి అందుకు భిన్నంగా కొన్ని శాఖలు మూడో తేదీ, మరి కొన్ని ఐదో తేదీ, ఇంకొన్ని ఆరో తేదీ అంటూ వివిధ రకాలుగా ఇచ్చారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఒకే జాయినింగ్ తేదీ ఇవ్వాలనీ, వార్డు ఆఫీసర్లకు జాబ్ చార్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో ఓ కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల గ్రామంలో శుక్రవారం జరిగింది. సీఐ ఆలే రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... సముద్రాల గ్రామానికి చెందిన రైతు చిలువేరు బాపురాజు (35) ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, ఈ ఏడాది అధిక వర్షాలు పడటంతో పంట దిగుబడి సరిగా రాలేదు. గతేడాది అప్పులు చేసి పంటకు పెట్టుబడి పెట్టాడు. సుమారు రూ.ఆరు లక్షల వరకు అప్పులయ్యాయి. ఈసారి పంట తక్కువ దిగుబడి రాగా మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన భార్య కోమల చుట్టూ పక్కల వారి సాయంతో చికిత్స కోసం తరలిస్తుండగా మృతిచెందాడు. బాపురాజుకు ఇద్దరు పిల్లలున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఉచిత విద్యుత్ పథకం సబ్సిడీ బకాయిలు చెల్లించాలి

- పైళ్ల ఆశయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉచిత విద్యుత్ పథకం సబ్సిడీ బిల్లుల బకాయిలను వెంటనే చెల్లించాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడిరాజు నరేష్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ నెం. 2 ప్రకారం 250 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన బిల్లుల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. ఐదు నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విద్యుత్ బోర్డుకు బిల్లులు చెల్లించని కారణంగా కింది స్థాయి విద్యుత్ అధికారులు రజకుల లాండ్రీషాపుల వద్దకొచ్చి కరెంటు బిల్లు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. కొన్నిచోట్ల కనెక్షన్లు తొలగిస్తున్నారని తెలిపారు. తీవ్ర ఒత్తిడి చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. సమస్యను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలనీ, సబ్సిడీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బిసి (ఎ) రిజర్వేషన్ పరిరక్షణకు సంఘాలన్నీ ఐక్యంగా పోరాడి రిజర్వేషన్లను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. జిఒ నెం. 190 ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ వెంటనే రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చిటికన ముసలయ్య, రాష్ట్ర నాయకులు, సి మల్లేష్, జ్యోతి ఉపేందర్, పావురాల రాములు, ఏదునూరి మదర్, గోపాల్, శాలీశ్వర్, సి వెంకటస్వామి, శోభ, రాములు, భాస్కర్, రాంబాబు, వివిధ జిల్లాల నుండి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విజిలెన్స్ చైతన్య వారోత్సవాల్లో సిబ్బందితో మాట్లాడుతున్న సుబ్బారావు

సెంట్రల్ బ్యాంక్‌లో విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి-హైదరాబాద్

సర్దార్ వల్లాబాయ్ పటేల్ జయంతి వార్షికోత్సవాల సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 31 నుంచి నవంబర్ ఆరు వరకు నిర్వహిస్తున్న విజిలెన్స్ చైతన్య వారోత్సవాల్లో భాగంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పలు కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో జోనల్ హెడ్ కెఎస్ఎన్‌వి సుబ్బారావు తమ ఉద్యోగులు, సిబ్బందితో అవినీతిరహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. "అభివృద్ధి దేశం కోసం అవినీతిరహిత భారత్" నినాధం ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మోడీ, షాలపై కేసు నమోదు చేయాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఆర్ఎస్‌కు చెందిన నలుగురు ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించిన వ్యవహారంలో సిఎం కెసిఆర్ బయట పెట్టిన వీడియోల ఆధారంగా ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బిఎల్ సంతోష్‌పై కేసులు నమోదు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శుక్రవారం డిమాండ్ చేశారు. ఎనిమిది రాష్ట్రాల్లో ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేయడంలో వారి పాత్ర ఉందని ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వీడియోల ఆధారంగా ఆయా రాష్ట్రాలలో ప్రభుత్వాలను పడగొట్టడానికి జరిగిన కుట్రపై ఆయా రాష్ట్రాల హైకోర్టులు సూమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని కోరారు. ఇప్పటికే ఈ వీడియోలను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, అన్ని రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులకు పంపినట్టు సిఎం కెసిఆర్ ప్రకటించారని పేర్కొన్నారు.

తక్షణమే పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టానికి మరింత పదును పెట్టాలనీ, ఫిరాయింపుదారులపై చర్యల విషయంలో చట్ట సభల స్పీకర్, చైర్మెన్ కేంద్ర ఎన్నికల సంఘాలను జవాబుదారీ చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని సూచించారు.

వెంకటరావు కథలు మనోరంజకాలు

- ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ



ప్రజాశక్తి-కల్చరల్

బాలం వెంకటరావు రచించిన కథలు హాస్య, వ్యంగ్యభరిత మనోరంజకాలు అని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ.రమణ అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మానస ఆర్ట్స్ థియేటర్ నిర్వహణలో బాలం వెంకటరావు రచించిన అఖిల భారత పశు(జంతు) ప్రదర్శన హాస్య వ్యంగ్య కథానికల సంపుటి ఆవిష్కరణ సభ శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. కథల పట్ల యువతలో ఆసక్తి కలిగించాలని అన్నారు. సామాజిక పరిస్థితులను అంచనా వేసుకునేందుకు కథలు దోహదం చేస్తాయని తెలిపారు. వెంకటరావు కథలు సుమారు ముప్పై ఏళ్ల క్రితం సమాజ స్వరూపాలను తెలిపే విధంగా ఉన్నాయన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ కథా రచయిత విహారి మాట్లాడుతూ కథకు ముగింపులో మెరుపు అవసరమని, అలాంటి ట్విస్టులు వెంకటరావు కథలలో ఉన్నాయని అభినందించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ఇతర భాషల్లో వెలువడుతున్న స్థాయిలో కథా సాహిత్యం తెలుగులో రావడంలేదన్నారు. కథా రచయితలు సింహప్రసాద్, వాణి శ్రీ, కె.పి.అశోక్ కుమార్ సంపుటిలోని కథలను విశ్లేషించారు. సంస్థ కార్యదర్శి రఘుశ్రీ స్వాగతం పలికిన సభకు అధ్యక్షుడు రామచంద్రరావు వందన సమర్పణ చేశారు.

హైదరాబాద్‌లో 'ఫార్ములా-ఈ' రేసింగ్

- ఫిబ్రవరి 11న నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచంలో అత్యంత వేగంగా ఆదరణ పొందుతున్న 'ఫార్ములా-ఈ' రేసింగ్ తొలి సారి భారత్‌లో ట్రాక్ ఎక్కనున్నది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న హైదరాబాద్‌లో ఈ ఈవెంట్ జరగనుంది. ఇందుకోసం దేశ రాజధాని ఢిల్లీ నగరంలో లాంఛనంగా అభిమానుల కోలాహలం మధ్య శుక్రవారం వంద రోజుల కౌంట్ డౌన్ ప్రారంభమైంది. కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి, నీతి ఆయోగ్ సిఇఒ అమితాభ్ కాంత్ తదితరుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఫార్ములా-ఇ ప్రిక్స్ ఈవెంట్‌ను ప్రపంచంలోని పన్నెండు దేశాలు మాత్రమే నిర్వహిస్తున్నాయని, అందులో భారత్ కూడా ఒకటని గుర్తుచేశారు. ఇప్పుడు హైదరాబాద్‌లో జరగనుంది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన తొమ్మిదవ సీజన్ అని వివరించారు. గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందిన హైదరాబాద్ ఇప్పుడు లండన్, బెర్లిన్, రోమ్, సౌపాలో, మెక్సికో, జకార్తా, కేప్ టౌన్, మొనాకో, దిరియా (సౌదీ అరేబియా) సరసన నిలవనుంది. రానున్న నాలుగు సంవత్సరాల వరకు ఈ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. 2014లో ప్రారంభమైన ఫార్ములా-ఈ రేసింగ్ ఇప్పటివరకు 100 రేసులను పూర్తి చేసుకుంది. నగరంలో జరిగే ఈ కార్యక్రమానికి హెచ్‌ఎండిఎ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ ఏర్పాట్లను చూడనున్నారు.

ఐక్యపోరాటాలతోనే విజయాలు

- జై భగవాన్, ప్రధాన కార్యదర్శి, మిడ్ డే మీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయ అవసరాలకు ప్రజా పోరాటాలను అనుసంధానం చేస్తే మెరుగైన ఫలితాలు సాధించొచ్చని హర్యానా మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళనలు నిరూపించాయంటూ ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, హర్యానా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జై భగవాన్ అభిప్రాయపడ్డారు. సమాఖ్య జాతీయ మహాసభల సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల పోరాట ఫలితాలను ఆయన వివరించారు.

"హర్యానాలోని 22 జిల్లాల్లో 28వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారు. అన్ని జిల్లాల్లోనూ సమాఖ్య కమిటీలు ఉన్నాయి. 2009లో వీరి ఆందోళనలు ప్రారంభానికి ముందు వారి వేతనం వెయ్యి రూపాయిలు. 2012 వరకు వరుస ఆందోళనలు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం రూ.150 వేతనం పెంచింది. 2013లో మరోసారి జరిగిన ఉద్యమంతో వారి వేతనం రూ. మూడు వేలకు పెరిగింది. ఆ తర్వాత రాష్ట్రంలో అశావర్కర్లు, అంగన్‌వాడీల ఉద్యమాలు పెద్ద ఎత్తున జరిగాయి. ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో వారి వేతనాలు పెంచింది. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని మధ్యాహ్న భోజన కార్మికులు మరోసారి పోరుబాట పట్టారు.

ఈసారి వారి వేతనం మరో రూ.నాలుగు వేలు పెరిగి, మొత్తం రూ.ఏడు వేలకు చేరింది. ఆశాలు, అంగన్‌వాడీల పోరాటాల కొనసాగింపును మధ్యాహ్న భోజన కార్మికులు సంఘటితంగా అందిపుచ్చుకోవడంతో ఇది సాధ్యమైంది. ఉత్తర ప్రదేశ్‌లో 4.34 లక్షల మంది, మధ్యప్రదేశ్‌లో 2.74 లక్షలు, పశ్చిమ బెంగాల్‌లో 2.34 లక్షల మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారు. వారందరికీ చాలా తక్కువ వేతనాలు ఉన్నాయి. స్కీం వర్కర్ల మూవ్‌మెంట్ పెంచగలిగితే, దాన్ని అందిపుచ్చుకొని, అందరూ ఐక్య పోరాటాల్లోకి రావడం వల్ల ప్రయోజనాలు పొందగలుగుతారు.



సమావేశంలో మాట్లాడుతున్న జై భగవాన్

దానికి హర్యానా ఉద్యమాలే ప్రత్యక్ష ఉదాహరణ. దేశం మొత్తంలో 26 లక్షలకు పైగా స్కీం వర్కర్లు ఉన్నారు. అయితే వారందరినీ సంఘటితం చేయడం సాధారణ విషయం కాదు. కానీ సాధిస్తామనే విశ్వాసం ఉంది". అని తెలిపారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

- ఎఐవైఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎస్సై, కానిస్టేబుల్ ప్రాథమిక రాత పరీక్షల ఫలితాల్లో అభ్యర్థులకు తీవ్ర నష్టం జరిగిందని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలీఉల్లా ఖాద్రీ, కె ధర్మేంద్ర తెలిపారు. ఇదే అంశంపై గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం ఆధ్వర్యాన వినూత్నంగా చెవిలో పువ్వులు పెట్టుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశ్నాపత్రాల్లో వచ్చిన తప్పిదాలను గుర్తించి, తగిన విధంగా మార్కులు కలపకుండా ఫలితాలు వెల్లడించడంతో లక్షలాది మంది అభ్యర్థులు నష్టపోయారని తెలిపారు. దీనిపై తగిన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు సురేష్, శంకర్, లింగం రవి, యుగంధర్ పాల్గొన్నారు.

ఉపఎన్నికలో ప్రజాస్వామ్యం ఖూనీ

- దాసు సురేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉప ఎన్నికలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ చేసి ఎన్నికల వ్యవస్థను దిగజార్చరనీ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని బిసి రాజ్యాధికార సమితి కన్వీనర్ దాసు సురేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సామాన్య వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయాలంటే భయపడే పరిస్థితులను తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగంగా డబ్బు పంపిణీ చేస్తున్నా ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పోలీసులూ ప్రేక్షకపాత్ర వహించారని తెలిపారు.

వచ్చే ఏడాది హైకోర్టు సెలవులివే..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఏడాది హైకోర్టు సెలవులతో కూడిన నోటిఫికేషన్ ను రిజిస్ట్రార్ జనరల్ శుక్రవారం విడుదల చేశారు.

జనవరి 12 నుంచి 17 వరకు సంక్రాంతి, మే ఒకటి నుంచి 31 వరకు వేసవి, అక్టోబర్ 25 నుంచి 27 వరకు దసరా సెలవులుగా పేర్కొన్నారు. అదే విధంగా ఆయా పండుగలకు సంబంధించి 12 సెలవులతో పాటు మరో ఏడు సెలవులు ఆదివారాలు లేదా రెండో శనివారం వచ్చినవి ఈ జాబితాలో ఉన్నాయి. ఏప్రిల్ నాలుగున మహావీర్ జయంతితో పాటు మొత్తం 13 రోజులను ఆప్షనల్ హాలిడేస్‌గా నిర్ణయించారు.